క్లుప్తంగా

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి



గోపాలపురంలో తపాలా అధికారుల నుంచి జాతీయ జెండాను స్వీకరించిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: తపాలా శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దిన వేడుకలకు దేశం ముస్తాబవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా పోస్టాఫీస్‌లలో జాతీయ జెండాను రూ.25కు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్థానిక సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యరాజు ఆధ్వర్యంలో పోస్టల్ అధికారులు, సిబ్బంది గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి తొలి జాతీయ జెండాను అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో త్యాగమూర్తులు ప్రాణాలు అర్పించారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ పతాకం రెపరెపలాడించి, త్యాగమూర్తులను స్మరించుకోవడం భావిభారత పౌరుల ప్రథమ కర్తవ్యమన్నారు. స్థానిక పోస్టుమాస్టర్ ఆర్ ఎన్‌బీ చార్యులు, మెయిల్ ఓవర్సీర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో భారీ వర్షం

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై నీరు నిలిచిపోయింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. రెండు రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి కాస్త సేద తీరారు.

ఆకట్టుకున్న నాద నీరాజనం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వయోలిన్ విద్వాంసుడు కంభంపాటి లక్ష్మీ నరసింహమూర్తి నాద నీరాజనం ఆకట్టుకుంది. స్వామివారిని స్తుతిస్తూ ప్రదర్శించిన ఈ కార్యక్రమం ఆద్యంతం భక్తులను అలరించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

అయినవిల్లి: నల్లచెరువులో సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభిస్తారని మండల పరిషత్ సూపరింటెండెంట్ శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ఆలమూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. గుమ్మిలేరులో శుక్రవారం పౌష్టికాహార కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహార కిట్లను అందిస్తున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి పి.పద్మావతి పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించాలి

పి.గన్నవరం: గాజులగుంట పంట కాలువ శివారు భూములకు సాగు నీరందించాలని ఆ ప్రాంత రైతులు స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. గాజులగుంట, ముంగండపాలెం గ్రామాల్లో భూములకు నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మట్టపర్తి వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, పెరుమాళ్ల పెదకాపు, ముత్తాబత్తుల సాంబమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కోకో, వాలీబాల్, త్రోబాల్ పోటీలు జరిగాయి. ఇందులో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం జి.సాయిబాబా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో 6, 7, 8 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం జి.సాయిబాబా ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీను పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. విజేతలకు 15న బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశం

అయినవిల్లి: తొత్తరమూడి వీవర్స్ కామన్ ఫెసిలిటీ భవనంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. దీనికి నియోజకవర్గ కన్వీనర్ సంగీత సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ, మహమ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు

- గ్రామాల్లోనే అన్ని సేవలు
- ప్రజలకు చేరువైన పాలన

రావులపాలెం: ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైంది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ముంగిటకే పథకాలు అందుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 2న సచివాలయ వ్యవస్థ పురుడు పోసుకుంది. రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేశారు. అక్కడ 11 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామాల్లోనే అన్ని సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు సచివాలయ వ్యవస్థలో భాగంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. పింఛన్, రేషన్‌తో సహా ప్రభుత్వం అమలు చేస్తున్న 28 రకాల సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే తీసుకు వస్తున్నారు.



గోపాలపురం గ్రామ సచివాలయం

పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నవారిని గుర్తించి వారికి తక్షణం ప్రభుత్వ సహాయం అందించే విధంగా సరికొత్త పాలనకు అంకురార్పణ చేశారు.

అందుతున్న సేవలివీ..

ప్రభుత్వ సేవల కోసం గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు దగ్గరయ్యాయి. నవరత్నాల్లో ప్రధానమైన పింఛన్ల పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్, రైతు భరోసా, దీర్ఘకాలిక రోగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్ ఇలా ఎన్నెన్నో సేవలు సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్నారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

రావులపాలెం మండలంలో ఇలా..	
గ్రామ పంచాయతీలు	12
సచివాలయాలు	23
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	31,228
ఇంత వరకు పొందిన సహాయం	రూ.38.98 కోట్లు
పింఛన్ లబ్ధిదారులు	11,706 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	రూ.112.05 కోట్లు

మంచి ఫలితాలిస్తున్నాయి..



సచివాలయాల ద్వారా అద్భుతమైన సేవలందిస్తున్నారు. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్తే సరిపోతుంది. గడువులోగా ఆ పని మా గ్రామంలోనే పూర్తి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధమైన పరిస్థితి లేదు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం తాజాగా తీసుకు వచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

–కోనాల రాజ్‌కుమార్, రావులపాలెం

ఎన్నో పథకాల లబ్ధి



మా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నేను ఎక్కడికి వెళ్లడం లేదు. వలంటీర్ మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకువెళ్లాడు. మా కుటుంబానికి పంటల బీమా, ఆసరా, వాహన మిత్ర, రైతు భరోసా, సున్నా వడ్డీ (డ్వాక్రా), విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా మొత్తం రూ.2,17,540 లబ్ధి చేకూరింది. ఇవన్నీ కేవలం సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమైంది.

– ఇర్లపాటి బాలాజీ, ఆటోడ్రైవర్, రావులపాలెం

ప్రజలకు మేలు



ప్రభుత్వం నుంచి ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. గ్రామంలోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అన్ని శాఖల ఉద్యోగులు ఇక్కడ అందుబాటులో ఉంటున్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. వలంటీర్లు ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబానికి పథకాలు అందిస్తున్న తీరు బాగుంది.

– మహ్మద్ అన్వర్, సెక్రటరీ, గోపాలపురం

సీఎం సభ విజయవంతం



కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: అమలాపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ సభకు పి.గన్నవరం నియోజకవర్గం నుంచి 30 వేల మంది హాజరయ్యారని చెప్పారు. సభకు వచ్చిన ప్రతి డ్వాక్రా మహిళలకు పార్టీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అమలాపురం సభకు మహిళలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ రాయితీ వంటి పథకాలు అమలు చేస్తున్న జగన్ ప్రభుత్వానికి మహిళలు అండగా నిలుస్తున్నారని చెప్పారు.

నిందలు వేయడం తగదు

మలికిపురం: కేశనపల్లిలో రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నామని సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, సుంకర బాబ్జి ఆరోపించడం విచారకరమని సర్పంచ్ యెనుముల నాగు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులను తొలగిస్తున్న తమపై నిందలు వేయడం సరి కాదన్నారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు.

నామినేషన్ తిరస్కరణ

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు ఎన్నికకు ఐదు నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం ఒక నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.మంగాదేవి తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచామన్నారు. 14వ తేదీలోగా నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చన్నారు.

సీఎంకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే కుమార్తె



సీఎం జగన్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు కుమార్తె దేవీప్రియాంక

మామిడికుదురు: అమలాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం హెలిపాడ్ వద్ద పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, లక్ష్మి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు కుమార్తె పిట్టా దేవీప్రియాంక, అన్వేష్‌కు ఇటీవల వివాహం జరగ్గా సీఎంకు పరిచయం చేశారు. ఆ దంపతులను సీఎం ఆశీర్వదించారు. దేవీప్రియాంక సీఎం జగన్‌కు రాఖీ కట్టి ముందస్తుగా రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

• ఆత్మీయ స్వాగతం







వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు శుక్రవారం అమలాపురానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న కొత్తపేట, రాజోలు ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, రాపాక వరప్రసాదరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

ఐక్యతతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి

రాజోలు: మాలలు ఐక్యతతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాటిపాక సెంటర్‌లో మాల మృతవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఆగస్టు 11న పలువురు మాల సోదరులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అప్పటి నుంచి మాల మృతుల వీరులను స్మరించుకుంటున్నామన్నారు. కొల్లాబత్తుల సతీష్‌బాబు, బొంతు మణిరాజు, పోతుమూడి శేఖర్, తిరుమల కుమార్, ఇంజేటి వెంకటరత్నం, విప్పర్తి మహేష్, తాడి ధర్మారావు, ఉండ్రు జాన్, గెడ్డం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు తీసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.మల్లిఖార్జున, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఈ ఏర్పాట్లను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు.

హామీల అమలు ఘనత జగన్‌దే

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



మగటపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మగటపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పకుండా మడమ తిప్పకుండా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా జగనన్న సంక్షేమ పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. జనరంజకంగా పాలన సాగి స్తున్న జననేత జగన్‌కు ప్రజలు తోడుగా నిలవాలని కోరారు. రాజకీయ స్వలాభం కోసం ప్రతిపక్షాలు చేసే కుయుక్తులను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, గ్రామశాఖ అధ్యక్షుడు బందారు పండు, నేతలు మంగెన సింహాద్రి, కుసుమ శ్రీధర్, ఎండీవై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకుందాం..



చెముడులంకలో తిర్నాతి వారసుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు, అధికారులు

ఆలమూరు: ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చెముడులంకలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులను సత్కరించారు. గ్రామాభివృద్ధికి విశేష తోడ్పాటు అందించిన దివంగత తిర్నాతి సూర్యనారాయణ మూర్తి సేవలకు కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అవార్డుకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ హాలులో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పారిశ్రామికవేత్త లవకుశరావు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. త్యాగధనులను స్మరించుకుందామని అన్నారు. గ్రామ సర్పంచ్‌గా, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేసిన తిర్నాతి గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమించారన్నారు. అనంతరం తిర్నాతి కుటుంబ సభ్యులతో పాటు ఆర్మీలో పనిచేసి దేశరక్షణ బాధ్యతలో తమవంతు సహకారం అందించిన దివంగత గంగుమళ్ల సత్యనారాయణ కుటుంబీకులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించి మెమెంటోలను అందించారు. ఎన్ఆర్ఐ రాయుడు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సత్యనారాయణ, అడబాల వీర్రాజు పాల్గొన్నారు.,

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నా భూమి– నాదేశం కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీపాలు వెలిగించి అమర వీరులకు నివాళులర్పించారు. తర్వాత మొక్కలు నాటారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకుడు బీపీఎన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు

- సీఎం జగన్ పాలనలోనే సాధ్యం
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



కొత్తపేటలో మండల పరిషత్ ఆర్చి గేటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లె సీమలు ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మండల పరిషత్ ముఖద్వారంలో కొత్తగా నిర్మించిన ఆర్చి గేట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో పేదల జీవితాలకు వెలుగులు వచ్చాయన్నారు. తాజాగా సున్నా వడ్డీ పథకం కింద రాష్ట్రంలో సుమారు 1.06 కోట్ల మంది డ్వాక్రా సంఘాల మహిళలకు రూ 1,353.76 కోట్లు విడుదల చేశారన్నారు. అభివృద్ధిలో మండలాన్ని ఆదర్శంగా తీసుకు వెళ్తున్న ఎంపీపీ గంగాధరరావును అభినందించారు.

మహనీయుల త్యాగాలు స్మరిద్దాం

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులను స్మరించుకుందామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీపీ గంగాధరరావు ఆధ్వర్యంలో నాభూమి–నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్తూపాన్ని ఆవిష్కరించి అక్కడ దీపాలు వెలిగించి అమర వీరులకు నివాళులర్పించారు. వసుధకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకట నాగమణి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, కుడుపూడి రామలక్ష్మి, దూనబోయిన నవదీప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



సమస్యలు వివరిస్తున్న శివకోడు సర్పంచ్ నక్కా రామారావు

రాజోలు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు సర్పంచులు కోరారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. మండలంలో ఉపాధి పథకంలో చేపడుతున్న నాభూమి–నాదేశం కార్యక్రమాల్లో గుర్తించిన పనులకు ప్రతిపాదనలు చేశారు. శివకోడు సర్పంచ్ నక్కా రామారావు మాట్లాడుతూ రాజోలు–శివకోడు పంట కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. శివకోడు ఎస్సీ సొసైటీ భూములకు విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. స్వయం శక్తి సంఘాలకు రుణాలు మంజూరు కాగానే యానిమేటర్లు మామూళ్లు వసూలు చేస్తున్నారని కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ ఆరోపించారు. గ్రామంలో యానిమేటర్ పోస్టు ఖాళీ అయితే సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియకుండా డీఆర్‌డీఏ అధికారులు నియామకం చేయడం దారుణమన్నారు. మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

ఆత్రేయపురం: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది రాకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఏడీఏ ఎమ్‌వీ రామారావు తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖరీఫ్‌లో ఈ–పంట నమోదు ప్రారంభమైందన్నారు. రైతులంతా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌ను రైతు భరోసా కేంద్రంలో ఇచ్చి పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఉద్యాన అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ వరదల వల్ల కలిగిన నష్టాన్ని నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ మండలంలో అరటి రైతులకు రూ.1.2 కోట్ల బీమా నగదు రైతుల ఖాతాలో జమ అయ్యిందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పట్టాభిరామయ్య, ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, పశు వైద్యాధికారి పీవీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. పలు డ్వాక్రా సంఘాలకు సంబంధించిన ఆసరా నిధులు వేరే సంఘాల ఖాతాలకు జమ సమస్య ఎంతవరకూ పరిష్కారమైందని ఏపీఎంను ఎంపీపీ వివరణ కోరారు. ఇంకా ఐదారు గ్రూపుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకం కింద మండలానికి రూ 2.15 కోట్లు విడుదల చేశారని తెలిపారు. అవిడి గ్రామ పరిధిలో వరి చేల మధ్య చెరువు ఊటనీరు కారణమో ఏమో గాని వరి మూనలు మాడిపోతున్నాయని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం తెలిపారు. దీనిపై వీఆర్‌ఓను, వీఏఏను పంపించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు తెలిపారు. అవిడి మీదుగా రాజోలు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు ఆర్టీసీ అధికారిని కోరారు. ఇటీవల వరదల కారణంగా పంట నష్టం నమోదు, ఆర్‌బీకేల్లో సోషల్ ఆడిట్ ఎంతవరకూ వచ్చిందని ఎంపీపీ ఉద్యాన అధికారిని ప్రశ్నించారు. మండలంలో 4 గ్రామాల పరిధిలో 500 మంది రైతులకు సంబంధించి 426 ఎకరాల్లో పంట నష్టం నమోదు చేసినట్టు తెలిపారు. డీసీఎంఎస్ చైర్పర్సన్ సాకా మణికుమారి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, ఎంపీడీఓ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అంబాజీపేట: ఓ కారు అదుపుతప్పి ముక్కామల వద్ద పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ జలం చెరువుకు చెందిన పిల్లి సుధీర్‌బాబు, పిల్లి అనిల్, కె.బాబి, కట్టా ప్రసాద్‌లు కారులో వెళ్తున్నారు. ముక్కామల వచ్చేసరికి వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. కట్టా ప్రసాద్‌కు తప్పా మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అంబాజీపేట పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయ్యింది.

మహిళ ఆచూకీ లభ్యం

ఆలమూరు: మడికిలో ఈ నెల 5న అదృశ్యమైన కోరుకొండ అప్పలనరసమ్మ (43) ఆచూకీ లభ్యమైంది. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. స్థానిక నాగులపేటలో నివసిస్తున్న చెముడు, మూగ దివ్యాంగురాలైన ఆమె ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అనకాపల్లి జిల్లా చింతపల్లిలో తమ బంధువుల ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆమెను తీసుకువచ్చి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోడి పందేలపై దాడి

కొత్తపేట: కోడి పందేలపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఏఎస్సై ఐ.బ్రహ్మాజీరావు తెలిపారు. వానపల్లి శివారు సంఘంపాలెం ఏటిగట్టు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు ఈ దాడి చేశారన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో శుక్రవారం ధవళేశ్వరానికి చెందిన రాధాకృష్ణ బృందం నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఏటా స్వామివారి సన్నిధిలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.